# చివరకు మిగిలేది

- గంధం యాజ్ఞవల్క్యశర్మ



కలెక్టరాఫీసులో ఏదో పనిపడి గుంటూరు వచ్చి,ఆ పని ముగించుకుని తిరిగి నరసరావుపేటకు వెళ్ళేందుకు మార్కెటు సెంటరులో బస్సుకోసం ఎదురు చూస్తూ నిలుచున్నాను.
అక్కడే 'మావూరు' పుసులూరు వెళ్ళేందుకు బస్సుకోసం, ఎదురు చూస్తున్న ''బుచ్చిరాం'' బాబాయి కన్పించారు. నన్ను చూస్తూనే ''ఏరా నాయినా...'' అంటూ దగ్గరకొచ్చి నా భుజం మీద చెయ్యివేసి.... ''అంతా బాగున్నారా'' అన్నారు బాబాయి. బాబాయి కనులు చెమ్మగిల్లాయి. బాగానే వున్నాం బాబాయి! మీరు, సుభ్రదక్కాయి, పిన్ని ఎలా వున్నారు....'' అన్నాను.
ఏదో వున్నాం ఇలా అన్నాడు. ఏదైనా పనిపడి వచ్చారా అని అడిగాను. ఈ మధ్యకాలంలో బాబాయి ఇల్లు కదలి బయటకు అంతగా రావటం లేదు.

ఆ!.... పనిబడే రెండు రోజుల కొకసారి ఈ వూరు తిరుగుతున్నాను కానీ, ఏదీ.... ఆ పనే ఒక పట్టాన తెమలటం లేదు. ఈ ఎండలకు ఇక తిరగలేనేమో అనిపిస్తోంది.

బాబాయికి డెబ్బయి ఏళ్ళు దాటాయి.

''అంతగా మీరు తిరగాల్సిన పనేమిటి బాబాయ్'' అన్నాను.

అదేరా సుభద్రకు నెలనెలా రావలసిన భరణం తాలూకు పెన్షన్ ఆగిపోయింది. నెలకు రెండువేల చొప్పున కోర్టు ఆర్డరు ప్రకారం దాని భర్త పెన్షన్ అకౌంటు నుండి, మన ఊరి ప్రక్కనున్న 'కాకుమాను' బ్యాంకు బ్రాంచిలోని సుభద్ర అకౌంటుకు బదిలీ అయి వస్తుంది కదా... అలాంటిది రెండు నెలలుగా ఆగిపోయింది. ఎందుకనో అర్థం కాలేదు. సుభద్ర కొడుకు 'కృష్ణుడు' విశాఖపట్నంలో ఇంజినీరింగ్ చదువుతున్నాడు కదా.... వాడికి ఆ మొత్తం నెలనెల పంపుతూ వుంటాం. ఈ రెండు నెలలుగా వాడికి పంపలేకపోయాం. వాడికి చాలా ఇబ్బందిగా వుందిట. స్నేహితుల దగ్గర అప్పులు చేస్తున్నాడట. ఇకపై కష్టం అని వ్రాశాడు.

కాకుమాను బ్రాంచి వాళ్ళు గుంటూరు ట్రెజరికి వెళ్ళి కనుక్కోమన్నారు. ఈ ట్రెజరీ వాళ్ళు ఏమీ చెప్పరు ఎప్పుడు వెళ్ళి అడిగినా, ఇప్పుడు చాలా బిజీగా వున్నాం రేపురా.... మాపురా.... అని తిప్పుతున్నారు. ఈ నెల ఇది నాలుగోసారి రావటం....''ఏం చేయాలో అర్థం కావటం లేదు'' అన్నారు బాబాయి ఎంతో నిస్పృహగా.

బాబాయి పెద్దగా చదువుకోలేదు. ఆఫీసులన్నా, ఆఫీసర్లన్నా వాళ్ళతో ఏం మాట్లాడితే ఏమో అని బిడియపడే తత్వం ఆయనది.

అదేమిటి బాబాయి మాట మాత్రం నాకు కబురు చెప్తే నేనొచ్చి కనుక్కోలేకపోయేవాణ్ణా, ఆ వివరాలు ఇటుతే, నేను ట్రెజరీకి వెళ్ళి.... పెన్షను ఎందుకాగిందో కనుక్కొంటాను'' అన్నాను.

''ఎక్కడో నరసరావుపేటలో వున్న నీకు శ్రమ ఎందుకులే అని....'' అని అంటున్న బాబాయిని ''అదేమిటి బాబాయి సుభద్రక్కయ్య పని నాకు శ్రమనా... మీరు నిశ్చింతగా వుండండి ఆ పనేదో నేను చూస్తాను అని హామీ ఇచ్చి, బాబాయిని మా వూరు వెళ్ళే బస్సు ఎక్కించాను.

గుంటూరుకు ఇరవయి మైళ్ళు మావూరు.

బాబాయి అంటే మా నాన్నగారి పినతండ్రిగారి కుమారుడు. గత ముప్పయి నలభయి సంవత్సరాల కాలంలో మావూరు నుండి మా బంధు

వర్గ కుటుంబాలు, ఒక్కొక్కటే అక్కడి ఆస్థిపాస్తులను అమ్ముకుని పలు చోట్లకు, పిల్లల చదువుకోసమో, ఉద్యోగాల వెతుకులాటకో.... మరేదో వ్యాపకాల నిమిత్తమో, వలసలు పోగా, ఇంకా ఆవూరి నంటిపెట్టుకుని మిగిలింది మా బాబాయి ఒక్కరే.

నాన్నగారు - బాబాయి స్వంత అన్నదమ్ముల్లా ఎంతో, అనురాగ ఆప్యాయతలతో వుండేవారు. నాన్నగారు పోయేనాటికే నేను ఉద్యోగం చేసుకుంటూ పరాయిచోట్ల వుంటూ వుండేవాడిని. నాన్నగారు పోయాక పదేళ్ళ క్రిందటే నా కుటుంబాన్ని తీసుకుని నరసరావుపేట చేరాను. ఉద్యోగం మానివేసి, ఎరువుల వ్యాపారం మొదలుపెట్టాను.

నాన్నగారి ఆఖరి క్షణాల్లో, నన్ను దగ్గరకు పిలిచి.... నాన్నగారు నాకు అప్పగించింది. ఆస్థిపాస్తులను కాదు. బాబాయిని సుభద్ర అక్కయ్యను.

''బుచ్చిరాం బాబాయి ఒంటరివాడు సుభద్ర తోడు కోల్పోయింది. వాళ్ళిద్దరికీ తోడు నీడగా వుండు'' అన్నారు.

జీవిత ప్రవాహ వేగపు ఉక్కిరిబిక్కిరిలో మన అనురాగాలు, ఆప్యాయతలు మన కనుగప్పి ఎలా పలుచబడిపోతాయో....!

మావూరు వదలిన కొత్తలో తరచుగా బాబాయి వాళ్ళను చూడటానికి అక్కడకు వెళ్ళి వచ్చే నేను ఆ తరువాత తరువాత, అప్పుడప్పుడు ఆపై ఎప్పుడోకాని వెళ్ళలేక పోయేవాణ్ణి. ఈ వ్యాపారమనే రాక్షసి కబంధ హస్తాల చిక్కుముడులలో చిక్కుకుని ఏ సంవత్సరమో అయింది బాబాయిని చూసి.

సుభద్రక్కయ్య బాబాయి ఏకైక సంతానం నాకంటే అక్కయ్య పదేళ్ళు పెద్దది. నేను హైస్కూలు చదువుకు వచ్చిన సంవత్సరమే బాబాయి భార్య లక్ష్మీదేవి పిన్నికి స్వయాన అన్నకొడుకైన లక్ష్మీనారాయణతో అక్కయ్య పెండ్లి అయింది.

అప్పటికి లక్ష్మీనారాయణ బి.ఎ. పాసై వున్న నిరుద్యోగి. తల్లి తండ్రి గతించారు. లక్ష్మీదేవి పిన్ని పట్టుదల వల్లే ఆ పెండ్లి జరిగింది.

మా నాన్నగారు, తనతో చదువుకుని డిప్యూటీ కలెక్టరుగా పనిచేస్తున్న స్నేహితుడి ద్వారా రెవిన్యూ డిపార్టుమెంటులో, టెంపరరీగా యల్.డి.సి. ఉద్యోగం వేయించారు. లక్ష్మీనారాయణకు రెండు సంవత్సరాలు గడిచేపాటికి అతడి అదృష్టమో అన్నట్లు అలా పనిచేస్తున్న వారి సర్వీసులను సర్వీసు కమీషనుతో నిమిత్తం లేకుండా రెగ్యులరైజ్ చేసింది ఆనాటి ప్రభుత్వం.

అలా పర్మినెంటు అయిన లక్ష్మీనారాయణ, సర్వీసులో ఒక్కొక్కమెట్టే ఎక్కుతూ ప్రమోషన్లు పొందుతూ పైకి ఎగబాకి పదిహేనేళ్ళ సర్వీసు అయ్యేసరికి సివిల్ సప్లయిస్ డిప్యూటీ తాసిల్దారయ్యాడు.

అవినీతికి అస్కారమున్న పోస్టది. అందుకు వెనకాడే మనస్తత్వం గల మనిషి కాదతడు. చిన్నగా ఆ బాటనే వేగం అందుకున్నాడు. చేతినిండా డబ్బు లభ్యం అవ్వటంతో అలవాట్లు అబ్బటం మొదలయ్యాయి. అనతికాలంలోనే అవి ఊపందుకుని రాత్రిళ్ళు ఆలస్యంగా ఇంటికి రావటం, ''అదేమన్న'' అక్కయ్యతో మొదట్లో మొదట్లో ఆఫీసులో ఏవో పార్టీలని అబద్దాలు చెప్పటంతో ప్రారంభమైన, ఆ పార్టీలు, ''మందు'' పార్టీలుగా ''మగువల'' పార్టీలుగా మారి శృతి మించటంతో అక్కయ్య పరిస్థితి చాలా దయనీయంగా మారిపోయింది.

అప్పటికి అక్కయ్యకు ఒక మగ పిల్లవాడు. వాడు కొంచెం లేట్ ఛైల్డ్ వాళ్ళకి.

అక్కయ్య, లక్ష్మీనారాయణ ప్రవర్తన బయటకు తెలిస్తే తన కాపురం ఎక్కడ బజారున పడుతుందో అని చాలా కాలం తనలోనే దాచుకుని భరించింది. కాని నానాటికి పెచ్చరిల్లిపోతున్న అతని ఆరాచకాన్ని ఆపైన భరించలేక పోయింది.

అడ్డమైన ఆడవారిని స్నేహితురాళ్ళంటూ అర్ధరాత్రి , అపరాత్రి ఇంటికి తీసుకురావటం, ఇంటిలోనే మందు దుకాణం పెట్టి వాళ్ళకు అవి అందించు, ఇవి అందించు అంటూ అక్కయ్యకు పురమాయించటంతో అందుకు అక్కయ్య నిరాకరించడంతో ఆమెను తిట్టటం కొట్టటం వరకు వచ్చింది వ్యవహారం.

అది తెలుసుకున్న బాబాయి, పిన్ని వెళ్ళి ఆ సంసారాన్ని చక్కదిద్దాలని ఎన్నో విధాల ప్రయత్నించారు. బ్రతిమాలారు, బామాడారు, బంధువులచేత చెప్పించారు.

''ససేమిరా, లక్ష్మీనారాయణ వాళ్ళ హితోక్తులు విన్నాడు కాదు. పైగా బాబాయి, పిన్ని సమక్షంలోనే ''నీవు నాకొద్దు వెళ్ళిపో'' అంటూ అక్కయ్యను కొట్టి, కట్టుబట్టలతో బయటకు గెంటి వేశాడట. అక్కడే వుంచితే మరేం చేస్తాడో అనే భయంతో అక్కయ్యను పిల్లవాణ్ణి మావూరు తీసుకుని వచ్చారు బాబాయి.

అక్కయ్య పుట్టింటికి వచ్చి సంవత్సరం గడిచినా, లక్ష్మీనారాయణలో ఎలాంటి మార్పు రాలేదు. పైగా ఎవరినో ఒకర్తెను ఇంట్లో పెట్టుకుని వున్నట్లు వార్తలు వచ్చాయి.

అతగానిపై ఆశలు వదులుకొంది అక్కయ్య. అప్పటికి మా నాన్నగారు జీవించే వున్నారు.

''ఇక లాభం లేదురా బుచ్చిరాం, లీగల్ నోటీసు పంపిద్దాం'' అన్నారు నాన్న.

ప్లీడరు ద్వారా నోటీసు పంపించారు. దానికి ఆ సుభద్ర, ఆమె కొడుకు, ఎవరో తనకు తెలియదని వారికి తనకు ఎలాంటి సంబంధం లేదని సమాధానం పంపాడు లక్ష్మీనారాయణ.

ఇక తప్పలేదు కోర్టులో దావావేయాల్సి వచ్చింది. కోర్టువారు అక్కయ్యకు లక్ష్మీనారాయణ జీత భత్యాల నుండి, నెలనెలా కొంత భాగాన్ని భరణంగా ఇవ్వాల్సిందిగా తీర్పు ఇచ్చింది. అలా నెల నెలా మావూరికి రెండు మైళ్ళలో వున్న కాకుమాను స్టేట్‌బ్యాంకు బ్రాంచిలోని అక్కయ్య అకౌంటుకు భరణం జమ అయ్యేది.

నాలుగేళ్ళ క్రిందట లక్ష్మీనారాయణ రిటైరయ్యాడు. అతని పెన్షను నుండి కూడా అక్కయ్యకు నెలనెలా భరణం జమ అయ్యేది.


***

ఆ మర్నాడే గుంటూరు వచ్చి ట్రెజరీ కెళ్ళాను. నా బాల్య మిత్రుడు ''ఖుద్దూస్'' కన్పించాడు. అతనిప్పుడు, ఎ.టి.ఓ. అయి అక్కడే పనిచేస్తున్నాడట.

ఫైలు చూసి డిసెంబరు నెలలోపల ఇవ్వవలసిన ''లైఫ్ సర్టిఫికెట్'' లక్ష్మీనారాయణ ఇవ్వలేదు, అందుకే పెన్షను ఆగిపోయిందని చెప్పాడు.

అతడెందుకు లైఫ్ సర్టిఫికెట్టు ఇవ్వలేదో, ఏమో.

ట్రెజరి ఫైలు ప్రకారం లక్ష్మీనారాయణ రేపల్లె యం.ఆర్.ఓ.గా రిటైరయినట్లు పెన్షను గుంటూరు ట్రెజరీ నుండి కోరుకున్నట్లు వుంది. అందులో అతని నివాసపు చిరునామా, గుంటూరు కొత్తపేట, బోస్‌బొమ్మ దగ్గర అని వుంది.



లక్ష్మీనారాయణను నేను బావా అని పిలిచికాని, ఎదురుపడి మాట్లాడటం కాని గత పదిహేను ఇరవయి ఏళ్ళ క్రిందటి మాటే..... ఈ మధ్యకాలంలో అతనిని చూసింది కాని, కలిసింది కాని లేదు.

ఇప్పుడు తప్పదేమో అనుకుంటూ, కొత్తపేటలోని అతని నివాసపు చిరునామా వెతుక్కుంటూ వెళ్ళాను. ఆ ఇంట్లో అతను లేడు. మరెవ్వరో వున్నారు. రెండేళ్ళ క్రిందటే ఆ ఇంటిని అమ్మివేసి అగ్రహారం ఎనిమిదోలైనులో అద్దె ఇంటికి మారిపోయినట్లు తెలిసింది.

అగ్రహారం, ఎనిమిదోలైను కెళ్ళి లక్ష్మీనారాయణ అద్దెకున్న ఇంటికోసం గాలించాను. ఓ కిరాణా కొట్టతను, "రిటైర్డు యం.ఆర్.ఓ.గారుంటున్న ఇల్లేనా అంటూ ఆ ఇంటి గుర్తు చూచాయిగా చెప్పి అక్కడ ప్రయత్నించండి అన్నాడు. అక్కడికి వెళ్ళాను.

అక్కడ లక్ష్మీనారాయణ లేడు.

మూడు నెలలయిందట లక్ష్మీనారాయణ చనిపోయాడట.

"మీకేమౌతాడు, అని వాకబు చేసి నేనెవరో తెలుసుకుని, సంవత్సరంగా పక్షవాతంతో మంచానపడి తీసుకు తీసుకు పురుగులపడి చచ్చాడు..... పాపిష్ఠి ముండాకొడుకు" అంది ఆ ఇంటి ముసలావిడ.

ఆవిడగారికి లక్ష్మీనారాయణ చరిత్రంతా తెలుసులావుంది. ఆవిడగారే మరికొంత చెప్పింది.

లక్ష్మీనారాయణ రేపోమాపో పోతాడనగా అతనితో వుండే ఆ సుందరమ్మ ఇంటిలోని, సరుకు, సామాను మొత్తాన్ని చేబ్రోలులోని తన తమ్ముడింటికి చేరవేసిందట. అతను పోయిన సాయంత్రమే ఆ ఇంటిని ఖాళీ చేసి వెళ్ళిపోయిందట. ఆవిడ వెళ్ళాక ఇంటిని కడిగిస్తుంటే ఆవిడ పారవేసిపోయిన పాత ఇనుపరేకు పెట్టెలో ఇవిగో ఈ కాగితాలు దొరికాయి అంటూ ఓ శిథిలావస్థలో వున్న కాగితాల కట్ట నాకిచ్చింది.

అది లక్ష్మీనారాయణ పెండ్లయిన కొత్తలో అక్కయ్య పేర గుంటూరుకు దగ్గరలో వున్న 'గుజ్జనగూళ్ళ' అనే గ్రామాన కొన్న ఒకటిన్నర ఎకరం తాలూకు దస్తావేజు.

***

లక్ష్మీనారాయణ మూడు నెలల క్రిందట మరణించినాడనే వార్తను మోసికొని ఆ సాయంత్రమే మావూరు వెళ్ళాను.

సుభద్రక్కయ్య చాలా నిర్లిప్తంగా వినీవార్త!

బాబాయి "మాత్రం" పోయాడా అంటూ ఆ ఇంటి పురోహితులు ప్రతాప బుచ్చియ్య గారింటికి వెళ్ళివచ్చి "వాడెంత మనకు కాకుండా పోయినా ఏదో తూతూ మంత్రంగానైనా ఉత్తర కర్మలు చేయాలిట, విశాఖ నుండి కృష్ణుణ్ణి పిలిపించాలి" అన్నారు.

అగ్రహారం ఇంటావిడ ఇచ్చిన దస్తావేజుని ఇచ్చాను అక్కయ్యకు.

"అక్కయ్య మొదట ఆశ్చర్యపోయినా.... ఆ తరువాత, చిన్నగా జ్ఞాపకం చేసుకుని" అవును ఆ కొత్తలో అనేవాడు, మీరిచ్చిన కట్నం పెట్టి కొంత ఆస్థి నీ పేరే కొన్నానులే అని. అయితే నాకేనాడు చూపలేదు ఆ ఆస్థిని కాని ఆ దస్తావేజును కాని' అంది.

ఆ మరునాడు ఏ.టి.ఓ ఖుద్దూస్‌ను కలిశాను. డెత్ సర్టిఫికెట్ సంపాదించు, కోర్టు ఆర్డరుందిగా, మీ అక్కయ్యగారి పేరు మీద ఫ్యామిలి పెన్షను శాంక్షను చేయిద్దాం అన్నాడు.

గుంటూరు కార్పొరేషన్ ఆఫీసుకెళ్ళాను.

డిసెంబరు, పదవతారీకున లక్ష్మీనారాయణ శవదహనం జరిగినట్లు, స్మశానం నుండి వచ్చిన రిపోర్టు ఆధారంగా, అతని మరణం రికార్డు అయి వుంది.

ఎలాగైతేనేం మరో నెలరోజులలో కార్పొరేషన్ వారిచ్చిన డెత్ రిపోర్టు సాయంతో ఏ.టి.వో ఖుద్దూస్ సహకారంతో సుభద్రక్కయ్య పేర ఫ్యామిలీ పెన్షను మంజూరు చేయించగలిగాను.

ఆ ఆర్డరు అక్కయ్యకు ఇవ్వటానికి మా వూరు వెళ్ళిన సందర్భంగా అక్కయ్య పేర రిజిష్టరయిన ఆ దస్తావేజు తాలూకు ఆస్థి విషయం వచ్చింది.

"ఇప్పటిదా.....ఏ నాటి దస్తావేజు" ఆ పొలం ఎక్కడుందో ఏమో.... దానిని వెతికి స్వాధీనం చేసుకోవటం మాటలా ఈ "లాయలాస మనం పడగలమా" అంటూ బాబాయి చాలా నిస్పృహగా మాట్లాడాడు.

"అదేంటి బాబాయి ఎంత చెడ్డా ఈ పాటికి దాని విలువ లక్షల్లో వుంటుంది. ఎందుకు వదలాలి. మన కృష్ణుడికి పై చదువులకన్నా పనికొస్తుంది ప్రయత్నిద్దాం" అన్నాను.

అక్కయ్య అవుననలేదు-కాదనలేదు మౌనంగా వుండిపోయింది.

***

అతి కష్టం మీద ఆరాతీసి గుజ్జనగూళ్ళ మాజీ కరణం శివయ్య గారిని కలిశాను.

కరిణీకాలు పోయిననాడు గవర్నమెంటుకు స్వాధీనం చేసిన అడంగలు రిజిష్టరు కాపీ ఆయన వద్ద వుంది. ఆ గ్రామం, ఆ గ్రామ కంఠాన వున్న భూములు గుంటూరు కార్పొరేషన్ పరిధిలోకి చేరిపోయాయని చెప్పాడాయన.

ఆ ఆస్థి ఇంకా చేతులు మారకుండా వుందా అనే అనుమానాన్ని లేవనెత్తాడు.

"అదెలా సాధ్యం దానిని మా అక్కయ్య ఎవరికీ అమ్ముతూ సంతకం చేయలేదు కదా" అన్నాను. నా అమాయకత్వానికన్నట్లు ఓ నవ్వు నవ్వి ఈ మాయ కాలంలో ఏది సాధ్యం కాదు కనుక అంటూ.

"ఓ పనిచేయండి ఈ తాలూకు ఆస్థిపై గత కాలానికల్లా ఈసీ కాపీ తీసుకోండి ఆపై దాని ననుసరించి ఏమి చేయాలో ఆలోచించవచ్చు" అన్నాడు.

# పగటి కునుకు పోటీలు...

ఆఫీసుల్లో మధ్యాహ్నం లంచ్ ముగించి చాలా మంది ఉద్యోగులు సీటు ముందు కూర్చుని కునికిపాటు పడుతుంటారు. ఈ అలవాటు మన దేశంలోనే కాదు.ప్రపంచం




లోని చాలా దేశాల్లో ఉందని అనడానికి ఈ పోటీలే నిదర్శనం.

స్పెయిన్‌లో పగటి కునుకును 'సిస్టా' అని అంటారు. సిస్టా అనేది చాలా ముఖ్యమైంది. మనదేశంలో ఆ విధంగా కునుకు తీయడం తప్పు. కానీ అక్కడ మాత్రం సర్వసాధారణం. ఈ విధంగా పగటి కునుకు తీసే ఉద్యోగులందరూ స్పెయిన్‌లో ఓ అసోసియేషన్‌గా ఏర్పడ్డారు. అసోసియేషన్‌తో ఆగిపోకుండా పగటి కునుకు తీసే వారికి పోటీ కూడా నిర్వహించారు. దీనికి కూడా పోటీలా? అని ఆశ్చర్యపోనక్కర్లేదు. ఈ పోటీలో చాలా మంది ఉత్సాహంగా పాల్గొన్నారట!

తొమ్మిది రోజుల పాటు ఈ పోటీలు నిర్వహించారు. ఒకేసారి ఐదుగురు వ్యక్తులు ఈ పోటీలో పాల్గొనవచ్చు. పోటీలో పాల్గొనే వారు నీలం రంగు సోఫాలో ఓ పక్కకి తిరిగి పడుకోవాలి. వీరు పడుకునే గదిలో వెలుతురు కూడా ఎక్కువగా ఉండడానికి మాల్ లైట్స్‌ను ఏర్పాటు చేశారు. లైటు వెలుతురులో వీరు కనీసం 20 నిమిషాల పాటు గాఢ నిద్రపోవాలి. పోటీదారులు నిద్రపోయే సమయాన్ని, గాఢ నిద్రను డాక్టర్లు దగ్గరుండి పరిశీలించారు. వారి గురకను కూడా పరిగణనలోకి తీసుకొన్నారు. ఎక్కువ సేపు, గాఢనిద్రపోయినవారికి అదనంగా బోనస్ పాయింట్లు కూడా ఇచ్చారు.

రిజిస్ట్రారు ఆఫీసుకెళ్ళి ఈసీ కోసం దరఖాస్తు చేసాను. వారం రోజుల్లో ఈసీ వచ్చింది.

ఆ ఆస్తిని మూర్తిరాజు అనే వ్యక్తికి అమ్మిన ట్లుంది ఈసీలో. నాకు తెలిసిన సివిలు లాయరు కేశవరావుగారిని కలిసి విషయం అంతా చెప్పాను. ఆ కాగితాలనన్నింటినీ చూసి ఫోర్జరి సంతకాలతో ఆ లక్ష్మీనారాయణే అమ్మేసి వుంటాడు. ఆ కొనుగోలు దారుడికి నోటీసు పంపిద్దాం, సమాధానం చూసి అవసరమనుకుంటే కోర్టుకెళదాం అన్నాడు.

లాయరు కేశవరావు నోటీసు పంపాడు.

వారం రోజుల తర్వాత ఓ రోజు, లాయరు గారు నాకు ఫోన్ చేసి ఆ ఆస్తిని కొన్న మూర్తిరాజు కబురెట్టాడు. రాజీకి వచ్చేట్లున్నాడు. ఓ సారి మీరు మీ అక్కగారిని తీసుకొస్తే అతన్ని పిలిపిస్తాను మాట్లాడవచ్చు అన్నాడు.

ఆ ఫోను వచ్చేపాటికి వ్యాపారపు పనిమీద హైదరాబాదుకు ప్రయాణమై వున్నాను. ఆ విషయమే ఆయనకు చెప్పి రెండు రోజుల తర్వాత వస్తానని చెప్పాను.

అలాగే అన్నారాయన.

మా ఆవిడ, మీరెలాగు హైదరాబాదు వెళుతున్నారుకదా నేనూ వస్తాను, మా అక్కయ్య వాళ్ళింటికి వెళ్ళి చాలా రోజులయింది అంది. సతీసమేతంగా హైదరాబాద్ వెళ్ళాను.

రెండురోజులనుకొన్నది హైదరాబాద్‌లో మరో రెండు రోజులు ఉండాల్సివచ్చింది. నాల్గవనాడు మేం తిరిగి వచ్చేసరికి "లక్ష్మీదేవి" పిన్ని చనిపోయిందనే పిడుగులాంటి వార్త నా కోసం ఎదురు చూస్తోంది.

మేం హైదరాబాద్ బయలుదేరి వెళ్ళిన నాటి రాత్రి, లక్ష్మీదేవి పిన్ని అకస్మాత్తుగా కళ్ళు తిరిగి పడిపోయిందట. ఆర్.ఎం.పి. ఆచార్యులుగారు చూసి గుంటూరు ఆసుపత్రికి తీసుకుని వెళ్ళమన్నారట. పైగా ఆరోజు పెద్ద వర్షం ఆ వర్షంలోనే, ఎలాగో అతి కష్టంమీద ప్రక్కనున్న పెదనందిపాడు వరకు ఎడ్లబండి మీద ఆ పైన లాస్ట్ ట్రిప్పు వచ్చిన బస్ మీద పిన్నిని గుంటూరు తీసుకుని వచ్చారట బాబాయి, అక్కయ్య.

జనరల్ హాస్పిటల్లో చేర్పించిన తర్వాత పిన్ని తెల్లవారు జామునకల్లా చనిపోయిందట. తిరిగి మా వూరు తీసుకుని వెళదామంటే ఎడతెరిపిలేని వర్షం మూలంగా వాగులు వచ్చి బస్సులు ఆగిపోవటమే కాక ఎలాంటి ప్రయాణానికి వీలు పడలేదట.

నాకోసం నరసరావుపేట ఫోన్‌చేస్తే, ఇంట్లో ఎవరూ లేకపోవటంతో ఎలాంటి సమాధానం లేదట. ఏం చేయాలో తెలియని స్థితిలో వున్న బాబాయికి ఆ హాస్పటల్ "తోటి" ఇదిగో ఈ నంబరుకు ఫోన్ చేయండి వ్యాన్ వచ్చి శవాన్ని స్మశానానికి తీసుకెళుతుంది అని చెప్పాడట.

నాల్గవనాడు మావూరు వెళ్ళగా చెప్పాడిదంతా. ఆపద్బాంధవుడిలా ఆ 'తోటి' తోడు పడ్డాడు లేకుంటే నేనేం చేయగల్గేవాణ్ణి.....

ఆ వ్యాన్‌లోకి ఆ పార్థివ శరీరాన్ని ఎక్కించి మాకు సాయంగా మా వెంట స్మశానానికి కూడా వచ్చాడతడు.

ఎవరో పుణ్యాత్ముడు తన తండ్రిపేర ట్రస్టు పెట్టి దాని క్రింద ఆ "మహాప్రస్థాన స్థలి" అనే స్మశాన వాటికను ఎన్నో సౌకర్యాలతో ఎలా ఏర్పాటు చేశారని.... చుట్టూ పెద్ద ప్రహరి..... లోపల ఒక "స్మృతి వనం" ఆ మధ్య దహన శాలలు మరోపక్క ఎలక్ట్రిసిటితో నడచే దహన వాటిక.... అక్కడే కట్టెలు, ఆ అవసరాలకు కావలసిన వస్తు సామాగ్రి లభ్యమవుతాయి. పురోహితులు అక్కడే వుంటారు. శవదహనాలకు వచ్చిన వారికి స్నానాలు చేయటానికి పంపులు వున్నాయి. ఇవ్వగలవారి వద్ద నుండి డబ్బు తీసుకుంటారు. బీద బిక్కల నుండి ఏమి తీసుకోరు. వారికి కావలసినవన్నీ ఉచితంగానే అందిస్తారు.

"అక్కడే, మీ పిన్ని దేహానికి అంత్య క్రియ జరిపి ఆ సాయంత్రానికి నేను సుభద్ర ఎలాగో ఇంటికి చేరాము" అన్నాడు బాబాయి.

***

ఒక నెల గడిచేక లాయర్ కేశవరావుగారిని కలిశాను. ఆలస్యానికి కారణం చెప్పాను.

ఆ మూర్తిరాజుగారు ఈ మధ్య తనే ఫోన్ చేశాడు అతన్ని గురించి వాకబు చేసాను చాలా పెద్ద మనిషిలా వున్నాడు అతడేమన్నాడో తెలుసా..... నేను మోసపోతే పోయాను. పాపం ఆ ఆడకూతురెండుకు నష్టపోవాలి, ఏదో విధంగా మీరే సెటిల్ చేయండి నేను కాదనేదేమీ లేదు అన్నాడు.

ఆ మరునాడే బాబాయిని, సుభద్రక్కయ్యను తీసుకుని కేశవరావుగారి దగ్గరకెళ్ళాను.

మూర్తిరాజుగారికి కేశవరావుగారు ఫోన్ చేసారు ఫోన్‌లోనే మూర్తిరాజుగారు "మరోలా భావించకండి....నా కారు పంపిస్తున్నాను. మీరంతా ఇక్కడకు రండి వెంటనే వెళ్ళిపోవచ్చు. నేనిక్కడ మా కంపెనీ మీటింగులో వున్నాను అన్నాడు."

కారు వచ్చింది.

ఆ కారు మమ్మల్ని గుజ్జనగూళ్ళ చిట్టచివరలో వున్న ఒక ఆఫీసు ఆవరణలోకి తీసుకుని వెళ్ళింది. ఆ ఆఫీసు కెదురుగా రోడ్డుకి అవతల వైపున పెద్ద కాంపౌండ్‌వాల్ దాని మధ్యన ముఖద్వారమున్న ఒక ఆర్చి. దానిపై "మహా ప్రస్థాన స్థలి" అన్న బోర్డు కన్పించాయి.

అక్కయ్య ఆశ్చర్యంగా అటు చూస్తూ అక్కడే అమ్మ దహన క్రియలు జరిగింది అంది.

బాబాయి ఆ "మహ ప్రస్థాన స్థలి" ముఖ ద్వారం వైపు చూస్తూ నిలబడిపోయాడు కొన్ని క్షణాలు.

"ఆఫీసులోనుండి ఓ నలభై అయిదేళ్ళ వయసున్న వ్యక్తి బయటకు వచ్చి అందరికీ నమస్కారం నేనే మూర్తిరాజును.... రండి" అంటూ ఎంతో మర్యాదగా మమ్మల్ని లోపలికి ఆహ్వానించాడు.

లోపల హాల్లో ఎవరో చాలా మంది మీటింగు తాలూకు సభ్యులు కామాల్సు వున్నారు.


"మీరేదో మీటింగులో వున్నట్లుంది" అన్నారు కేశవరావు.

పరవాలేదు మీటింగుకు ఓ అరగంట బ్రేక్ ఇచ్చాలెండి, అంటూ మమ్మల్ని మరో గదిలోకి తీసుకుని వెళ్ళారు, మూర్తిరాజుగారు.

కేశవరావు మమ్మల్ని పరిచయం చేసారు, మూర్తిరాజు గారికి.

మూర్తిరాజు గారు మాట్లాడారు.

"క్షమించండి....ఈ విషయంలో నేను తెలిసి చేసిన తప్పు లేదు. ఓ సత్కార్యానికి మాకు ఒక ఎకరం స్థలం కావాల్సి వచ్చింది. యం.ఆర్.ఓ.గారి తాలూకు పొలం వున్నదంటూ, ఓ బ్రోకరు బేరం తెచ్చాడు. అప్పట్లో ఆ భూమి విలువ ఎకరం ఒక్కింటికి రెండు లక్షలు వుంది. మూడు లక్షలకు కాని ఇవ్వనన్నారు. యం.ఆర్.ఓ గారు. మా అవసరం అలాంటిది. అరేటునే కొన్నాం.



సాక్షాత్తూ యం.ఆర్.ఓ. లాంటి గవర్నమెంటు ఆఫీసరే ఒక నకిలీ వ్యక్తిని తెచ్చి ఆమె సుభద్రమ్మ గారని తప్పుడు రిజిస్ట్రేషన్ చేయిస్తాడని ఎలా అనుకుంటాము''. 'సరే! జరిగిందేదో జరిగింది'' పాపం ఈమె గారెందుకు నష్టపడాలి చెప్పండి నన్నేం చేయమంటారో మీ కేం కావాలో అన్నాడు.

బాబాయిగానీ, నేను గానీ ఏమీ మాట్లాడ లేదు.

కేశవరావుగారే'' ఇంతకూ ఆ స్థలం ఎక్కడుంది'' అన్నారు.

మూర్తిరాజుగారు ఆశ్చర్యంగా.... అయితే, ఆ స్థలం ఎక్కడో కూడా మీకు తెలియదా.... అదిగో, రోడ్డుకవతల ఎదురుగా కన్పించే ఆ ''మహా ప్రస్థాన స్థలే'' ఆ స్థలం అన్నారు.

మేమంతా నివ్వెరపోయినట్లు అటుకేసి చూస్తూ వుండి పోయాము.

పోయిన డిసెంబరు నెలలో ననుకుంటా ఆ నకిలీ సుభద్రమ్మగారే ఆ ఎం.ఆర్.ఓ గారి శవాన్ని తెచ్చి అనాధశవం అన్నట్లు ఆ ''మహాప్రస్థాన స్థలి'' ముఖద్వారం వద్ద వదలి వెళ్ళిపోయింది.

''మేమే దహన సంస్కారాలు చేయించాం!'' అన్నారు మూర్తిరాజుగారు.

మేము ఏమి మాట్లాడక నిశ్శబ్దంగా వుండిపోయాం.

మీరు గొప్ప సత్కార్యం చేస్తున్నారు'' అన్నారు కేశవరావుగారు.

నాకు ఒక సిమెంటు ఫ్యాక్టరి వుంది. ఒక మేజరు హైడల్ ప్రాజెక్టు, పోగాకు ఎక్స్‌పోర్టు వ్యాపారంతో పాటు మరెన్నో వ్యాపారాలు వున్నాయి. కానీ వాటిని వేటినీ నాకున్న ఆస్తులంటూ గర్వంగా చెప్పుకోను.

భగవంతుడు నాకెంతో ఇచ్చాడు, ఇంకా ఇస్తున్నాడు, నేనేం చేసుకోవాలి ఈ సంపదనంతా.... ఇదంతా నాదికాదు, చివరకు మిగిలేవి సంపదలు కావు.

అనాధ పిల్లల కోసం ఒక హాస్టలు నెలకొల్పి వారికి ఉచితంగా తిండి, బట్టలతో బాటు విద్యనిచ్చే, హైస్కూల్సు, కళాశాలను ఏర్పాటు చేశాను. దిక్కులేని వృద్ధుల కోసం ఒక వృద్ధాశ్రమం నెలకొల్పి వారికి ఉచిత వసతి, ఇతర సౌకర్యాలను ఏర్పరిచాను. అలాగే ఈ ''మహా ప్రస్థాన స్థలి'' ఏర్పాటు చేశాను.

మరెన్నో.... ఇలాంటివే ఆనాధలకోసం, ఆర్తుల కోసం, సహాయక చర్యలు తీసుకున్నాను.

ఇదిగో వీటినే నా ఆస్తులు అని చెప్పుకుంటున్నాను.

మనం వెళుతూ మనతో తీసుకుని వెళ్ళేదేమీ లేదనే విషయం నిత్యం జ్ఞాపకం చేసుకునేందుకు నేను ప్రతిరోజు ఈ ఆఫీసు గది కిటికీ గుండా ఆ ''మహా ప్రస్థాన స్థలి''కి వచ్చే పార్థివ శరీరాలను తిలకిస్తూ వుంటాను'' అన్నారాయన.

ఆ మాటలు మూర్తిరాజుగారు మాట్లాడుతున్నప్పుడు ఆయన మోముపై ఎంతటి తాత్వికత, నిరాడంబరత గోచరించాయో!

ఏదో నిర్ణయించుకున్నట్లు అక్కయ్య ఒక్కసారి లేచి మూర్తిరాజుగారిని ఉద్దేశించి.

''మీరు నాకంటే చిన్నవారు....'' కాని మీకు పాదాభివందనం చేస్తున్నాను. మీరెవరో మీరేమిటో తెలియక మీకు నోటీసు పంపించాము. క్షమించండి. మాకేమీ వద్దు ఇలాంటి సత్కార్యాలను చేసేందుకు మీకు ఆయురారోగ్యాలనివ్వాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను.

అంటూ బయటకు నడిచింది.

నేను బాబాయి ఆమెననుసరించాం.

కాని మూర్తిరాజుగారు కేశవరావుగారి ద్వారా అక్కయ్య పేర పదిహేను లక్షలకు చెక్కు పంపించారు. అక్కయ్య ఆ చెక్కు నాకిచ్చి ''మదర్ థెరిస్సా ట్రస్టు'' నిధికి జమచేయించింది.

★

రచయిత సెల్ **9885320765**

# అమ్మ కళ్ళు




దోసెడు వరి అన్నం మీద వొంపిన
డోకుడు చారులోంచి పడ్డ
రెండు చింతగింజలు మా అమ్మ కళ్ళు
పేటలో ఉన్న రాములోరి గుడిలో
పచ్చి బియ్యాన్ని గుడ్డలో మూటగా కట్టి
నూనే మూకుడులో ఉంచి వెలిగించిన
సందె దీపపు వెలుగు మా అమ్మ కళ్ళు
చిన్నప్పుడు నాకు స్నానం చేయించి
నా నలుపు వొంటి నిండా ఎరుపు 'జాలీ' పౌడరును
మెత్తని కుచ్చుతో అద్దీ,
కాటుకను బొట్టుగా పెట్టి
వేలికి అంటిన కాటుకను తన కంటి కొసలకు రాసుకుంటే
అచ్చం మా పెద్ద రేవవతల నిలిచిన
కోనసీమ కొబ్బరి తోపులా ఉండేవి మా అమ్మ కళ్ళు,
ఎప్పుడో మా నట్టింటిలోకి
మట్టికాళ్ళతో నడిచ్చొచిన మా అమ్మ
చివరి వరకు తన కనుపాపలాంటి
మట్టికుండల మధ్యే గడిపింది
ఎప్పుడైన మా అమ్మతో ఊరిలోకి వెళ్ళితే
యానాం పాత బస్టాండులో
సూదాస్వామినాయుడు కొట్టులో వేలాడే
ఇత్తడి బిందెల వెలుగు మా అమ్మ కళ్ళలో కదలాడేది
నాకిప్పటికి గుర్తే
ఏ రాత్రన్న నాన్న ఆలస్యంగా ఇంటికి వస్తే
ఏడుగుర్ని నిద్ర పుచ్చడానికి
తాను ద్విపాత్రాభినయం చేసి
తూలుతూ వచ్చిన నాన్న తెరవెనుక
వెలుగు తగ్గిన చందమామ్యేవి మా అమ్మ కళ్ళు
గాలీ వాన వచ్చిన రాత్రి మాటిమాటికి ఆరిపోతున్న
కోడిగుడ్డు చిమ్నీ దీపానికి ఊపిరిపోస్తూ
రెపరెపలాడుతూన్న తన కనుదీపంతో
మా అందరికి కూడోండిపెట్టేది.
తెల్లారేసరికి చీకటిని తరిమేసే
చుక్కల ముగ్గును వాకిలిలో వేసి
రాత్రైతే చాలు
చిరిగిన చీర నక్షత్రాలను కలిపికుట్టే
కన్నీటి దారాలు మా అమ్మ కళ్ళు.
నాన్నకొట్టిన దెబ్బలకు
గాజులు పగిలి, చేయి తెగినా
అక్కల అతి సుకుమారపు చేతులు
పరాయి చేతిలో పవిత్రంగా ఉండాలని
తెల్లారేసరికి గోరింటాకై
అక్కల చేతుల మధ్య చందమామ్మై మెరిసే మా అమ్మ కళ్ళు.
ఇప్పుడు నాకమ్మాలేదు,
అమ్మ కళ్ళ ముందు కదలాడే తనమూ లేదు,
నా కంటి సముద్రంలో
అమ్మ జ్ఞాపకాల కనుపాప ప్రయాణానికి
నేనే చక్కానీనౌతాను

-రాం
**94404 34880**